ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
I
సోమవారం 20 అక్టోబరు 2025



పీలేరులో సందడే...సందడి...

● కొనుగోలుదారులతో కిటకిటలాడిన టపాకాయల దుకాణాలు
● పండుగ శోభ సంతరించుకున్న గ్రామాలు


పీలేరు ఏఎంసీ వద్ద ట్రాఫిక్ జామ్

పీలేరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ నేపథ్యంలో ఆదివారం పీలేరులో సందడి నెలకొంది. టపాకాయలు, కొత్త బట్టలు, పూజాసామగ్రి, ఇతర నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు జనం పెద్దఎత్తున తరలిరావడంతో అన్ని దుకాణాల్లోనూ రద్దీ నెలకొంది. సాధారణంగా ఆదివారం రోజు నిర్మానుష్యంగా కనిపించే పీలేరు రోడ్లు దీపావళి కోసం స్వగ్రామాలకు తరలివచ్చిన వారు, పీలేరు నుంచి ఇతర ప్రాంతాలకు వెళుతున్న వారు, కొనుగోళ్ల కోసం వచ్చిన వారితో రోడ్లన్నీ కిటకిటలాడాయి. దీంతో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం నాలుగు రోడ్ల కూడలి, ఆర్టీసీ బస్టాండు, పంచాయతీ ఆఫీసు మిట్ట ప్రాంతాల్లో పలుమార్లు ట్రాఫిక్ జామ్ అయింది. విజయదశమి రోజుల్లో దుకాణాలు, వాహనాలకు ఆయుధపూజ చేసుకోలేకపోయినా చాలా మంది ఆదివారం పూజలు నిర్వహించారు. ఏఎంసీ ప్రాంగణంలోకి టపాకాయల దుకాణాలు కొనుగోలుదార్లతో కిటకిటలాడాయి.


పీలేరు నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ జామ్


ఏఎంసీ ప్రాంగణంలోని టపాకాయల దుకాణాల వద్ద సందడి

హంద్రీ-నీవా కాలువ మరమ్మతులు పూర్తి

● కృష్ణా జలాల పంపింగ్ ప్రారంభం


గుండ్లపల్లి వద్ద పూర్తయిన హంద్రీ-నీవా కాలువ మరమ్మతులు

బి.కొత్తకోట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ పరిధిలోని గుండ్లపల్లి వద్ద హంద్రీ-నీవా కాల్వ తెగిపోయి కుప్పం వైపు కృష్ణా జలాల తరలింపునకు 5 రోజులుగా బ్రేక్ పడిన విషయం తెలిసిందే. ఈనెల 15న బి.కొత్తకోట మండలం తరిగోడు వద్ద ఉన్న 12వ పంపింగ్ స్టేషన్‌లో విద్యుత్ అంతరాయం కారణంగా మోటార్లు పనిచేయక దిగువ నుంచి వస్తున్న నీటిని ఎత్తిపోయలేకపోవడంతో దిగువ భాగంలో కాల్వ కట్ట తెగిపోయింది. దీంతో సత్యసాయి జిల్లా చెర్లోపల్లి రిజర్వాయరు నుంచి మూడు పంపింగ్ స్టేషన్ల లోనూ లిఫ్టింగ్ ఆపేశారు. కలెక్టర్ నిశాంత్‌కుమార్ సహా ఉన్నతాధికారులు పరిస్థితిని సమీక్షించారు. ఎస్ఈ విఠల్‌ప్రసాద్, డీఈలు అమరనాథరెడ్డి, రాజగోపాల్, ఏఈ ఆంజనేయులు సంఘటనా స్థలం వద్ద తిష్ట వేసి యుద్ధప్రాతిపదికన యంత్రాలు, కూలీలతో తెగిన కాల్వ మరమ్మతు పనులు చేపట్టారు. శుక్రవారం రాత్రి చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి గ్రావిటీ పవర్‌తో నీటి సరఫరా ప్రారంభించారు. శని, ఆదివారాల్లో సత్యసాయి జిల్లాలోని రామానాయక్ తండా, బొంతలపల్లి, అన్నమయ్య జిల్లా పీటీఎం మండలం కొత్తపల్లి వద్ద ఉన్న పంపింగ్ స్టేషన్లు 9, 10, 11 లను దాటి బి.కొత్తకోట పట్టణ శివారులోంచి తరిగోడు వైపునకు ప్రవాహం ఉరకలేసింది. సోమవారం తెల్లారేలోగా తరిగోడు వద్ద ఉన్న 12వ పంపింగ్ స్టేషన్ నుంచి కూడా లిఫ్టింగ్ ప్రారంభించనున్నట్టు హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు తెలిపారు.

పీజీఆర్ఎస్ తాత్కాలికంగా రద్దు

● కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని దీపావళి పండుగ సందర్భంగా తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో తాత్కాలిక రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించుకోవాలని తెలిపారు.

ఎస్పీ కార్యాలయంలో...

రాయచోటిటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ఈనెల 20వ తేదీ సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం రద్దు చేసిన విషయాన్ని దృష్టిలో పెట్టుకుని పలు సమస్యలపై జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి వచ్చే అర్జీదారులు జిల్లా పోలీసు కార్యాలయానికి రావద్దని ఎస్పీ కోరారు. అలాగే ప్రజలు, పోలీసు అధికారులు, సిబ్బందికి, మీడియా ప్రతినిధులకు ఎస్పీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లె రెడ్డెమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మిగా ప్రసిద్ధి చెందారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, పుష్పాలతో ప్రత్యేక అలంకరించి పూజలు చేశారు. సంతానం లేని దంపతులు సంతానం కోసం ఆకుపసరు తాగి ఆలయంలో వరపడ్డారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళ వివిద ప్రాంతాల నుంచి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో రెడ్డెమ్మ అమ్మవారు

పింఛా ప్రాజెక్టు నుంచి నీరు విడుదల

దిగువకు 10,896 క్యూసెక్కులు ● రాకపోకలకు అంతరాయం

సుండుపల్లె, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పింఛా ప్రాజెక్టు నుంచి ఆదివారం ఉదయం నీటిని విడుదల చేసినట్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్రనాయక్ తెలిపారు. ప్రాజెక్టు పైప్రాంతంలో శనివారం రాత్రి భారీ వర్షం కురవడంతో పీలేరు, తలకోన అటవీ ప్రాంతం నుంచి 11,118 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి చేరుతుండడంతో మూడు గేట్ల ద్వారా నదిలోకి 10,896 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. నీటిని నదిలోకి విడుదల చేయడంతో చిన్నబిడికి దిగువ భాగంలో పింఛా నదిపై నిర్మించిన లోలెవెల్ వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సుమారు 20 పల్లెలకు బస్సు సౌకర్యం లేకుండాపోయింది. నదీ పరివాహక ప్రాంతంలోకి ప్రజలు ఎవరూ వెళ్లకూడదని ప్రాజెక్టు, పోలీసు, రెవెన్యూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.


గేట్ల ద్వారా నదిలోకి విడుదల చేసిన నీరు

గంజాయి మాఫియా...

- మొక్కుబడి దాడులతో రెచ్చిపోతున్న స్మగ్లర్లు
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన కోడూరు


ఇటీవల రైల్వేకోడూరులో పట్టుకున్న గంజాయి, ముగ్గురిని అరెస్టు చేసిన ఎక్సైజ్ శాఖాధికారులు (ఫైల్)

రైల్వేకోడూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఖద్దరు అండతో రైల్వేకోడూరు నియోజకవర్గంలో గంజాయి స్మగ్లర్లు రెచ్చిపోతున్నారు. రైల్వేకోడూరు, ఓబులవారి పల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల్లో విచ్చలవిడిగా గంజాయి లభిస్తుం డడంతో యువత పెడదోవపడుతున్నారు. ప్రత్యేక నిఘా లేకపోవ డంతో తిరుపతి, రేణిగుంట నుంచి ఆటోల్లో గంజా యిని రైల్వేకోడూరుకు తరలిస్తున్నారని ఎక్సైజ్, సివిల్ పోలీసులు గుర్తించారు. ఇతర ప్రాంతాల నుంచి పెద్దపెద్ద ప్యాకెట్లలో రేణిగుంట, తిరుపతికి చేరుకున్న గంజా యిని చుట్టుపక్కల పట్టణాలకు ఆటోల్లో చేరవేస్తారు. ఆయా పట్టణాల్లో దానిని 50 గ్రాములు నుంచి 100, 200, 500, 700 గ్రాముల పరిమాణంలో ప్యాకెట్లు తయారు చేసి కిలో రూ.12 వేలకు విక్రయిస్తున్నారని అధికారుల విచార ణలో తేలింది. రిటై లర్లు దానిని చిన్న, చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి రూ.100 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. ఈ ఏడాది ఓబు లవారిపల్లె, చిట్వేలి మండలాల్లో సుమారు 100 కిలోల గంజాయి పట్టుకున్నారు.

భారీగా గంజాయి స్వాధీనం

ఇటీవల ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి సుమారు 1700 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. గంజాయిని ఎక్కడి నుంచి తెస్తారు, ఎవరు ఇస్తారు, ఎంతకు అమ్ముతారు వంటి వివరా లను ఇందులో ప్రధాన నిందితులు గణేష్, శంకర్‌ల నుంచి ఎక్సైజ్ శాఖ అధికారులు కూపీ లాగారు. వారి కాల్‌డేటాను విశ్లేషించారు. వారికి ఎవరెవరితో సంబంధాలున్న అంశంపై ఎక్సైజ్‌శాఖ కూపీ లాగి నట్లు తెలిసింది. గడిచిన ఆరేళ్లలో గంజాయి కేసుల్లో పది మందిని అరెస్టు చేశారు.

నేరాలకు కారణమట

విచ్చలవిడిగా గంజాయి లభ్యత నేరాలకు కారణమవు తోంది. శ్రీ కృష్ణా సినిమాహాలు వెనక, రెడ్డివారిపల్లె కొత్త బ్రిడ్జి, చుట్టుపక్కల తోటలతోపాటు రాఘవరాజ పురం, సమతానగర్, శెట్టిగుంట, రెడ్డివారిపల్లె రూటు, రైల్వేస్టేషన్ రూటు తదితర ప్రాంతాల్లో గంజాయి మత్తులో యువత తూలుతుంటారని అధికారులు గతంలో గుర్తించారు. ఇటీవల రెడ్డివారిపల్లె బ్రిడ్జి ప్రాంతంలో గంజాయి మత్తులో రెండు వర్గాలు ఘర్షణ పడ్డాయి. రాత్రివేళల్లో పోలీసుల నిఘా లోపించడంతో గంజాయి బ్యాచ్‌లు రెచ్చిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు గట్టి చర్యలు తీసుకోక పోతే అనర్థాలకు దారి తీసే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పటిష్టమైన నిఘా ఉంది



గంజాయి రవాణా, విక్రయాలపై పటిష్టమైన నిఘా ఉంది. ఎప్పటికప్పుడు సమాచారం అందు కుని దాడులు చేస్తున్నాం. గంజాయి ముఠా కోసం గాలిస్తున్నాం. ప్రస్తుతం రైల్వేకోడూరులో గంజాయి విక్రయాలు లేవు. ప్రజలు సహకరించి గంజాయి అమ్మకాలపై సమాచారం అందిస్తే దాడులు నిర్వహిస్తాం.

- తులసి, ఎక్సైజ్ సీఐ

చర్యలు తీసుకుంటున్నాం



గంజాయి విక్రయాలపై చర్యలు తీసుకుంటున్నాం. నిరంతరా యంగా నిఘా ఏర్పాటు చేశాం. సమగ్రమైన సమాచారం అందితే నిందితులు ఎంతటివారైనా వదిలి పెట్టే ప్రసక్తే ఉండదు.

- వీఎల్ ప్రసాద్‌రెడ్డి, ఎస్‌ఐ

నిత్యావసరాల పంపిణీ

రైల్వేకోడూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ తూర్పుపల్లెకు చెందిన కూటమి నాయకుడు దేశు కృష్ణారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా బోళాశంకర్ సేవా సమితి సహకారంతో ఆదివారం నరసరాంపేటలో పేద లకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. సమితి అధ్యక్షుడు మందల నాగేంద్ర, సభ్యులు ఉత్తరాది శివకుమార్, వాసా బాబు, పోలిశెట్టి రాజేశ్వరమ్మ, కొప్పల శంకరయ్య, సీహెచ్ రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండును వినియోగంలోకి తేవాలి

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణం సమీపంలోని ఆర్టీసీ బస్టాండును వినియోగంలోకి తీసుకురావాలని రాయచోటి నియోకవర్గ సీపీఐ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు అన్నారు. ఆదివారం సీపీఐ కార్యకర్తలతో కలిసి నిరుపయోగంగా ఉన్న బస్టాండును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1992లో నిర్మించిన బస్టాండు ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి బస్టాండును ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఓబులేశ్, శ్రీనివాసులు, నరసింహులు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ జేఈవో వెంకయ్యచౌదరితో చమర్తి భేటీ


జేఈవో వెంకయ్యచౌదరికి స్వామివారి ప్రతిమను అందజేస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థాన జేఈవో వెంకయ్యచౌదరిని రాజంపేట నియోజకవర్గ టీడీపీ అసెంబ్లీ ఇన్‌చార్జి చమర్తి జగన్ మోహన్‌రాజు ఆదివారం తిరుపతి పద్మావతి గెస్ట్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువతో సత్కరించి వేంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేశారు. అనంతరం రాజంపేట నియోజకవర్గంలోని పలు దేవాలయాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

తాళ్లపాకలో మాజీ సర్పంచ్ ఉద్దండం బ్రహ్మయ్య విగ్రహావిష్కరణ


తాళ్లపాకలో ఉద్దండం బ్రహ్మయ్య విగ్రహావిష్కరణ చేస్తున్న పలువురు నేతలు

రాజంపేట టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లపాకలో ఆదివారం మాజీ సర్పంచ్ ఉద్దండం బ్రహ్మయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. రాజంపేట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు, శ్రీశైలం ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ పోతుగుంట రమేశ్ నాయుడు, అన్నమాచార్య యూనివర్శిటీ అధినేత చొప్పా గంగిరెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, జనసేన నేత అతికారి కృష్ణ, మండల మాజీ అధ్యక్షుడు డాక్టర్ పారా సుబ్బానాయుడు,. అన్నమాచార్య ఇంజనీరింగ్ విద్యాసంస్థల అధినేత మోదుగుల పెంచలయ్య, పాలిటెక్నిక్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఉద్దండం సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్దండం బ్రహ్మయ్య సర్పంచ్‌గా తాళ్లపాక గ్రామానికి ఎనలేని కృషి చేశారని, ఆయన సేవలు తాళ్లపాకలో చిరస్థాయిగా ఉంటాయని ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించడం అభినందనీయమన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
సోమవారం 20 అక్టోబరు 2025

ఆ పునాదులకు ఆరేళ్లు

- 2019లో శిలాఫలకం వేసిననాటి సీఎం జగన్
- రూ.36 కోట్లతో పనులు ప్రారంభం
- అనంతరం పునాదులకే పరిమితం
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



పునాది దశలో ఆగిపోయిన మైనార్టీ సంక్షేమ గురుకుల కళాశాల

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ విద్యార్థుల సంక్షేమం కోసం కృషి చేస్తామని నాడు వైసీపీ ప్రభుత్వంలో కపట ప్రేమతో గొప్పలు చెప్పారు. విద్యార్థులకు గురుకుల పాఠశాల నిర్మిస్తామని స్వయంగా నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 డిసెంబరు 24న రాయచోటి పర్యటన సందర్భంగా కాలేజ్ గ్రౌండ్‌లో జరిగిన బహిరంగ సభలో రూ.36 కోట్లతో మైనార్టీ సంక్షేమ గురుకుల కళాశాల, మైనార్టీ సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల నిర్మాణాలకు శిలాఫలకాలు, ప్రారంభోత్సవాలు చేపట్టారు. అనంతరం పనులు చేపట్టి పునాది దశలోనే వదిలేశారు. అయితే ఆ పునాదులకు ఆరేళ్లవుతున్నా నేటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పనులు సాగకపోవడం విశేషం. రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలు అధికంగా ఉన్న నియోజకవర్గంలో ప్రజలను ఆకర్షించేందుకు వైసీపీ ఇలాంటి పథకాలను పెట్టి నిర్మాణాలు చేపట్టకుండా నిర్వీర్యం చేసిన ఘనత వైసీపీ వారికే దక్కుతుందని స్థానికులు చెబుతున్నారు. కూటమి నాయకులు రాష్ట్రంలో రాయలసీమ ప్రాంతంలో రాయచోటి, కడప, మదనపల్లి, పీలేరు, నంద్యాలతో పాటు కొన్ని నియోజకవర్గాల్లో ముస్లిం మైనార్టీలు అధికంగా ఉన్నారు. కూటమి ప్రభుత్వంలోనే మైనార్టీలకు అభివృద్ధి జరిగిందని అంటున్నారు.



గత వైసీపీ ప్రభుత్వంలో ప్రారంభోత్సవం చేసిన శిలాఫలకాలు

గురుకులాలతో ఎంతో ప్రయోజనం

ఉత్తమ ప్రతిభ కలిగిన విద్యార్థులను ఎంపిక చేసుకుని గురుకుల పాఠశాలలో నాణ్యమైన బోధన అందించే విధంగా గురుకుల పాఠశాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నారు. ప్రతిభ గల పేద విద్యార్థులకు గురుకులాలు చక్కటి భరోసానిస్తాయి. కార్పొరేట్ విద్యను అందుకోలేని పేద విద్యార్థులకు ఈ కళాశాలలు తోడ్పాటుగా ఉంటాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ గురుకుల పాఠశాల లక్ష్యంగా విద్యార్థులకు అందుబాటులోకి తేవాల్సిన ఆవశ్యకత ప్రభుత్వంపై ఎంతైనా ఉంది.



కడ్డీలు కట్టి వదిలేసిన మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



రాయచోటి నియోజకవర్గంలో 82 వేల మంది ముస్లిం మైనార్టీ జనాభా కలరు. జగన్ మైనార్టీల అభివృద్ధి చేసింది ఏమీ లేదు. గొప్పలు చెప్పడం తప్ప ముస్లిం మైనార్టీల అభివృద్ధి చంద్రబాబుతోనే జరిగింది. మైనార్టీ విద్యార్థుల కోసం ఆగిపోయిన గురుకుల పాఠశాల భవనం పనులను ఆయన దృష్టికి తీసుకెళ్లి నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చే విధంగా చూస్తాం. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో త్వరలో రాయచోటిలో మైనార్టీల సంక్షేమం కోసం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం.

- గాజుల ఖాదర్‌బాషా, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం పరిశీలకులు

నూనెవాండ్లపల్లె మార్గంలో రాకపోకలు నిలిపివేత

పీలేరు రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పింఛా నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పీలేరు-సదుం మార్గంలోని నాలేవాండ్లపల్లె నుంచి నూనెవాండ్లపల్లె మార్గంలో రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. బ్రిడ్జిపై నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో పీలేరు తహసీల్దార్ శివకుమార్ ఆదేశాల మేరకు రాకపోకలు నిలిపివేశారు. శనివారం నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు సదుం, సోమల మండలాల పరిధిలో భారీ వర్షం కురవడంతో పింఛా నది పరవళ్లు తొక్కుతోంది. దీంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు నది వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. పీలేరు పట్టణ సమీపంలో వెళుతున్న పింఛా నది జోరుగా ప్రవహిస్తోంది. పింఛా ఉధృతికి పీలేరు-సదుం మండలాల సరిహద్దు ప్రాంతమైన బాలంబారిపల్లె వద్ద నిర్మించిన గార్గేయ ప్రాజెక్ట్ నిండుకుండలా మారింది.

ముగిసిన నిందితుల కస్టడీ

- మూడోరోజు సురేంద్రనాయుడును విచారించిన సిట్
- విచారణ ముగియడంతో సబ్‌జైలుకు తరలింపు



మదనపల్లె ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్

మదనపల్లె /ములకలచెరువు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు నకిలీ మద్యం కేసులో నిందితుల కస్టడీ విచారణ ఆదివారంతో ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన నకిలీ మద్యం వ్యవహారంలో ఎక్సైజ్ ఉన్నతాధికారులు దూకుడు పెంచి కీలక అంశాలు రాబట్టారు. కేసులో కీలక నిందితుడైన కట్టా సురేంద్రనాయుడును మూడవ రోజైన ఆదివారం విచారణలో కీలక విషయాలను వెల్లడించినట్లు తెలుస్తోంది. ములకలచెరువులో ఎక్సైజ్ ఉన్నతాధికారులు దాడులు చేసిన సందర్భంగా లగేజీ వాహనంలో దొరికిన నకిలీ మద్యం తన వద్దకే తీసుకొస్తున్నారని, తన పొలంలోనే నకిలీ మద్యం ఉంచేవారని సిట్ బృందం అధికారి శ్రీనివాసరావు, కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డిలకు కట్టా సురేంద్రనాయుడు వెల్లడించినట్లు తెలిసింది. ములకలచెరువు నకిలీ మద్యం కేసులో తొలుత అరెస్టు అయిన పది మంది నిందితులను విచారించేందుకు తంబళ్లపల్లె కోర్టు అనుమతించడంతో ఈనెల 17వ తేదీ ఎక్సైజ్ పోలీసులు నిందితులను కస్టడీకి తీసుకున్న విషయం విదితమే. పెద్దతిప్పసముద్రం మండలం కమ్మవారిపల్లెకు చెందిన కట్టా సురేంద్రనాయుడు, కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన సయ్యద్‌హాజీ, విశాఖపట్నంకు చెందిన చుక్కల బాలరాజు, తమిళనాడుకు చెందిన గణేషన్ మనిమారన్, అనంతన్ శ్రీనివాసన్, సూర్య జగదీషన్, వెంకటేషన్ సురేష్, ఒడిషాకు చెందిన మిధున్‌దాస్, అనంతదాస్‌లతో పాటు రంగసముద్రంకు చెందిన బెల్ట్‌షాప్ నిర్వాహకుడు నాగరాజులను రెండు రోజుల పాటు మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్‌లో విచారించారు. శనివారం సాయంత్రం కట్టా సురేంద్రనాయుడు మినహా మిగిలిన తొమ్మిది మంది నిందితులను మదనపల్లె జిల్లా ఆసుపత్రిలో చికిత్స అనంతరం సబ్‌జైలుకు తరలించారు. కేసులో కీలక నిందితుడైన కట్టా సురేంద్రనాయుడును మాత్రం మూడు రోజుల కస్టడీకి కోర్టు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో ఆదివారం కూడా ఇతడిని విచారించి సాయంత్రం జిల్లా ఆస్పత్రిలో పరీక్షలు చేయించి మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు. కాగా పదిమంది నిందితులను కస్టడీకి తీసుకుని విచారించడంతో కేసులకు సంబంధించి కీలక విషయాలు రాబట్టగలిగారు. వీరు తెలిపిన వివరాల మేరకు ఎక్సైజ్ ఉన్నతాధికారులు కేసు దర్యాప్తు వేగం పెంచనున్నారు.

డీఏ పెంపుపై హర్షం

రామాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు దీపావళి కానుకగా ఒక డీఏతో పాటు 830 కోట్ల రూపాయలు ఈఎల్స్ జమ, పోలీసులకు సరెండర్ లీవ్ జమ, మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవ్ సర్వీస్ పొడవునా వాడుకునే వెసులుబాటు, ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు, డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలుపై సానుకూలంగా స్పందించడతో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో చాలా కాలం తరువాత ఆనందం నెలకొందని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆదిమూలం రామచంద్ర, జిల్లా కన్వీనర్ వీరాంజనేయులు, రామాపురం మండల గౌరవాధ్యక్షులు అంజనేయులు, రామాపురం మండల అధ్యక్షుడు పిచ్చిరెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులు నారా లోకేశ్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలకు ఉపాధ్యాయ సంఘాలు కృతజ్ఞతలు తెలిపాయి.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

సురక్ష యాప్‌తో నకిలీ మద్యం నివారణ

రాజంపేటటౌన్, అక్టోబరు 19 (ఆంధ్ర జ్యోతి): నకిలీ మద్యం ని వారించడానికి ప్రభుత్వం సురక్ష యాప్ ప్రవేశపెట్టినట్లు ఎక్సైజ్ సూపరింటెం డెంట్ జి.మధుసూదన్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని పలు మద్యం దుకాణాల నిర్వాహకులకు యాప్ పనితీరును వివ రించారు. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, మ ద్యం సీసాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి వివరాలు తెలుసుకోవచ్చు అన్నారు. జిల్లా వ్యాప్తంగా 122 మద్యం దుకాణాలు, 11 బార్లను పరిశీలిం చినట్లు తెలిపారఏవైనా అనుమానాలు ఉంటే 7981216391 నంబరుకు సమాచారం అందించాల న్నారు.



టపాసుల అంగళ్ల వద్ద కొనుగోళ్ల దృశ్యం

కరుణించిన వరుణుడు.. పుంజుకున్న టపాసుల వ్యాపారం

రైల్వేకోడూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో దీపావళి పండుగకు ముందు మూడు రోజుల పాటు వర్షం కురవడంతో టపాసుల వ్యాపారులు, పిల్లలు ఆందోళన లో పడిన విషయం తెలిసిందే. ఆదివారం ఎండ కాయడంతో వ్యాపారులు ఊపిరి పీల్చుకున్నారు. టపాసుల అంగళ్ల వద్ద బురద కారణంగా ప్రజలు కొంత ఇక్కట్లు పడ్డారు. కొందరు అంగళ్ల యజమానులు సిమెంట్ ఇటుకలతో దారి ఏర్పాటు చేశారు. రైల్వేకోడూరు తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్, అగ్నిమాపక శాఖ అధికారి విజయకుమార్, విద్యుత్, పోలీసు అధికారులు, సిబ్బంది పర్యవేక్షించారు. నిబంధనలు పాటించారా లేదా అని పరిశీలించారు.



టపాసుల అంగళ్లకు వెళ్లేందుకు ఇటుకలతో ఏర్పాటు చేసిన దారి

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రైల్వేకోడూరురూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిగుంట పంచాయతీ పరిధిలో ఆదివారం రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రేణిగుంట రైల్వే ఎస్‌ఐ మధు తెలిపిన వివరాల మేరకు రైలు పట్టాలపై మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించినట్లు తెలిపారు. మృతుడి వయస్సు 38 సంవత్స రాలు ఉంటుందని, అతను గోధుమ రంగు చొక్కా, గళ్ళ లుంగీ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం 9885961430 మరియు 9542166880 నెంబర్లకు సంప్రదించాలని రైల్వే పోలీసులు తెలిపారు.

పాముకాటుతో ఆవు మృతి

గాలివీడు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పాటుకాటుతో ఆవు మృత్యువాత పడిన ఘటన వెలిగల్లు గ్రామ పంచాయతీలో ఆదివారం చోటు చేసుకుంది. మండలంలోని వెలిగల్లు గ్రామానికి చెందిన మంచూరి వెంకట్రామిరెడ్డికి చెందిన ఆవు ఆదివారం పొలం దగ్గర మేత మేస్తుండగా పాము కాటు వేసింది. దీంతో ఆవు నోటి నుంచి నురగలు కక్కుతూ మృతి చెందింది. మృత్యువాత పడిన ఆవు విలువ దాదాపు రూ.50 వేలు ఉంటుందని, తనకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించాలని బాధిత రైతు కోరాడు.


మృతి చెందిన ఆవు



సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను పూర్తి చేస్తాం

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని అన్ని వీధుల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేయడంతో పాటు, డ్రైనేజీ వ్యవస్థను పూర్తి చేస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కొత్తపేట రామాపురంలోని అక్షర స్కూల్ వీధిలో టీడీపీ నాయకులు, మాజీ కౌన్సిలర్ చెంగా ఈశ్వరయ్య ఆధ్వర్యంలో సీసీ రోడ్డుకు భూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా, యువనాయకుడు మౌర్యారెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ కొండా భాస్కర్‌రెడ్డి, ఫారెస్ట్ డైరెక్టర్ రెడ్డెయ్యయాదవ్, కౌన్సిలర్ మదన్‌మోహన్‌రెడ్డి, పట్టణ టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

చిన్నమండెం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం తన స్వగ్రామమైన బోరెడ్డిగారి పల్లెలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు, అధికారుల నుంచి వినతి పత్రాలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు నాయకులు దుశ్శాలువాలతో సన్మానించారు.

మంత్రిని కలిసిన వాటర్ షెడ్ చైర్మన్

చిన్నమండెం : రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఆదివారం దిన్నెపాడు వాటర్ షెడ్ చైర్మన్ చిట్రాజుసుబ్బరాజు, దిన్నెపాడు మాజీ సర్పంచ్ మార్ల రాంమోహన్‌రెడ్డి కాంట్రాక్టర్ సుబ్బరాజు కలిసి దుశ్శాలువాలతో సత్కరించారు. పలువురు వైసీపీ నాయకులు త్వరలో టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారని వారు తెలిపారు.





రోలర్ స్కేటింగ్‌లో ఆదర్శ పాఠశాల విద్యార్థికి గోల్డ్‌మెడల్


గోల్డ్‌మెడల్‌తో వర్షిత

పుల్లంపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని ఎం.వర్షిత రోలర్ స్కేటింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించింది. శనివారం డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడపలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వర్షిత ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధంచింది. నవంబరులో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని పీడీ నీలకంఠరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని వర్షితను ప్రిన్సిపాల్ లీలాశ్రీహరి, తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయికి పెనగలూరు విద్యార్థులు

పెనగలూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణంలోని రెయిన్‌బో పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ఎంపీడీవో విజయరావు కుమార్తెలు సగిలి రావణ, సగిలి సంఘమిత్ర శనివారం కడప మున్సిపల్ పాఠశాల మైదానంలో జరిగిన జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎన్నికయ్యారు. ఒకటో తరగతి చదువుతున్న సగిలి రావణ రింగ్‌రేస్ 1, 2 విభాగాల్లో గోల్డ్‌మెడల్, ఏడో తరగతి చదువుతున్న సగిలి సంఘమిత్ర రజత పతకం సాధించారు. కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో వీరు పాల్గొనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.


రాష్ట్రస్థాయి ఎంపికైన ఎస్.రావణ, ఎస్.సంఘమిత్ర





వివాహానికి సీఎంను ఆహ్వానించిన వికాస్ హరికృష్ణ



కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ తన కుమార్తె లక్ష్మి లహరి వివాహానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఆహ్వానించారు. ఈ మేరకు ఆయన శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసి ఆహ్వానించారు. ఈ వివాహం ఈనెల 31వ తేదీ ఉదయం ప్రొద్దుటూరులోని రాయల్ కౌంటీలో జరగనుందని వికాస్ హరికృష్ణ తెలిపారు.



గల్లంతైన యువకుడి శవం లభ్యం

సిద్దవటం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిద్దవటం పెన్నానదిలో శనివారం మధ్యాహ్నం వంతాటిపల్లె గ్రామానికి చెందిన పొట్టిగాండ్ల నందా(35) చేపల వేటకు వెళ్లి నీటిలో మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న నందా భార్య పులి సుజాత హుటాహుటిన బంధువులకు సమాచారం ఇవ్వడంతో సిద్దవటం పోలీసులు రంగంలోకి దిగి అగ్నిమాపక రిస్కు టీమ్‌ను పిలిపించి గజ ఈతగాళ్లతో పెన్నానదిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం మూలపల్లె సమీపంలో శవం లభ్యమైనట్లు ఏఎస్ఐ బాలయ్య తెలిపారు. మృతుడి భార్య పులి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.


నందా మృతదేహాన్ని తీసుకొస్తున్న గ్రామస్థులు

మహిళ ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న అయేషా

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ మహిళ విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని పోలీసులు తెలిపారు. రామసముద్రం మండలం చెంబకూరుకు చెందిన చాంద్‌బాషా భార్య అయేషాతో హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో కుటుంబ కలహాల నేపథ్యంలో ఆదివారం విషద్రావణం తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్న అయేషాను భర్త గమనించి వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు జిల్లా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు రామసముద్రం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.









దోపిడీకి వేళాయె..!

● అధిక ధరలతో ప్రజలపై బాదుడు ● నివాసాల మధ్యనే దుకాణాలు ● మైనర్లతో దుకాణాల నిర్వహణ



గాలివీడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ వస్తోందనగానే టపాసుల విక్రయాల మాటున కోట్లాది రూపాయలు వెనకేసుకునేందుకు వ్యాపారులు సిద్ధమయ్యారు. తమిళనాడులోని శివకాశి తదితర ప్రాంతాల నుంచి తక్కువ ధరకు టపాసులు తీసుకొచ్చే వ్యాపారులు ప్రజలకు మాత్రం మూడింతలు అధిక ధరలకు అమ్ముతూ వారి జేబులకు చిల్లు పెడుతున్నారు. పన్ను ఎగవేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. రెగ్యులర్ లైసెన్స్ కలిగిన డీలర్లు మొత్తం విక్రయాల్లో పాతిక శాతం మాత్రమే పన్ను చెల్లిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మరికొందరు లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకోకుండానే వ్యాపారం చేస్తున్నారు. వాస్తవానికి టపాసుల వ్యాపారులు ప్రభుత్వానికి 18 శాతం పన్ను చెల్లించాలి. దుకాణం లైసెన్స్, టిన్ నెంబర్ ఉన్న స్లిప్పు మీద కాకుండా, తెల్లకాగితం మీద బిల్లులురాసి ఇస్తున్నారు. గాలివీడు మండలంలో 4 టపాసుల గోడౌన్లు ఉన్నాయి. వీరు సరఫరా చేసే బాణసంచా ప్యాకెట్ల అసలు విలువ రూ.100 ఉంటే వాటిపై రూ.1000కిపైగా ధర ముద్రించి ఉంటుంది. వీరు షాపులకు వచ్చే వ్యక్తులను బట్టి ధర నిర్ణయించి విక్రయిస్తున్నారు. దీపావళి సందర్భంగా మూడు రోజుల్లోనే కోటి రూపాయల వరకు ఇక్కడ వ్యాపారం జరుగుతుంది. పెళ్లిళ్లు ఇతర శుభకార్యాలు, వేడుకల సమయంలో రూ.లక్షల్లో టపాసులు విక్రయిస్తుంటారు. పన్ను చెల్లించకుండా వ్యాపారం నిర్వహిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరికి పెద్ద మొత్తంలో మామూళ్లు ముడుతున్నాయన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

పన్ను ఎగవేతకు సిద్ధం

మండలంలో టపాసుల విక్రయానికి సంబంధించి ఎంత మందికి రెగ్యులర్ లైసెన్స్ ఉంది అనేది ప్రశ్నార్థకమే. ఎక్కడ పడితే అక్కడ గోదాముల్లో దాచి అమ్ముతున్నా పట్టించుకునే వారు లేరు. వీరి నుంచి పన్నులశాఖకు 25 శాతం మాత్రమే జీఎస్టీ అందుతోందని తెలిసింది. శివకాశీ నుంచి తెచ్చిన టపాసుల్లో 80 శాతం బిల్లులు లేకుం డానే మాయ చేస్తున్నట్లు తెలుస్తోంది. పన్నులశాఖలో విధులు నిర్వర్తించే ఉన్నతాధికారులకు ఏటా ముడుపులు అందుతుంటాయని సమాచారం.

నివాసాల మధ్యనే దుకాణాలు

దీపావళి సందర్భంగా టపాసుల దుకాణాలు అడ్డగోలుగా ఏర్పాటవుతున్నాయి. జనవాసాలు, వాణిజ్య ప్రాంతాలు, రహదారుల పక్కన ఇష్టారీతిన ఏర్పాటు చేస్తూ ప్రజల ప్రణాలతో చెలగాటం ఆడుతున్నారు. గాలివీడు పట్టణంలో ప్రతి ఏటా గొర్ల సంత ప్రాంగణంలో అనుమతులు ఇస్తుండటంతో ఆ ప్రాంతంలో చుట్టూ దుకాణాలు, నివాసాలు ఉండటం కారణంగా స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. అధికారులు మాత్రం మామూళ్లకు అలవాటు పడి ఇష్టానురీతిన అనుమతులు మంజూరు చేస్తూ చెలగాటమడుతున్నాని ప్రజలు ఆరోపిస్తున్నారు. వెంటనే పట్టణ శివారు ప్రాంతంలో జనసంచారం లేని చోట దుకాణాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే కొన్ని గోడౌన్లు కూడా నివాసాల మధ్య ఉండటం ప్రాణాంతకంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

మైనర్లతో దుకాణాల నిర్వహణ:

దుకాణాల్లో 18 సంవత్సరాలలోపు పిల్లలు ఉండకూడదని అధికారులు చెబుతున్నా వ్యాపారులు మాత్రం నిబంధనలకు నీళ్లొదులుతున్నారు. కనీస అవగాహన లేని చిన్నపిల్లను దుకాణాల్లో ఉంచడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

బాణసంచా దుకాణదారులు నిబంధనల మేరకే నడుచుకోవాలి. నివాసాల మధ్య దుకాణాలు నిర్వహించరాదు. అధిక ధరలకు విక్ర యించినా, టపాసుల దుకాణాల్లో మైనర్లు ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. - భాగ్యలత, తహసీల్దార్, గాలివీడు

జాతీయస్థాయి క్రీడాకారిణికి చేయూత

వేంపల్లె, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న కాత్యాయని అనే విద్యార్థిని అండర్-19 రాష్ట్రస్థాయి గోల్‌షాట్ బాల్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. ఈ విద్యార్థినికి నందిపల్లె సర్పంచు సులోచన కుమారుడు ఎన్ఆర్ఐ శ్రీకాంత్‌రెడ్డి చేయూత నందించారు. ఆదివారం రూ.10వేల ఆర్థికసాయాన్ని అందించారు. జాతీయస్థాయిలో అండర్-19 గోల్‌షాట్ పోటీలకు ఎంపికైంది. ఈనెల 29 నుంచి నవంబరు 1 వరకు బీహార్ రాష్ట్రం బెగుసరాయ్ పట్టణంలో జరిగే పోటీల్లో ఈ విద్యార్థిని పాల్గొననుంది.

క్షత్రియ సంఘం అభివృద్ధికి సహకరిస్తాం : చమర్తి



సమావేశంలో మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : బోయనపల్లె శాన్వి ఇంటర్నేషనల్ పాఠశాలలో రాయలసీమ క్షత్రియ వికాస్ సమితి రాజంపేట గౌరవాధ్యక్షుడు కొండూరు శరత్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షత్రియ సంఘం అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ఈ సమావేశానికి ఫెడరేషన్ చైర్మన్ వెంకటపతి రాజు(పెద్దబాబు) అధ్యక్షత వహించారు. అనంతరం సెక్రటరి సత్యనారాయణరాజు, ట్రెజరర్ కేవీ సుబ్బరాజు, వైస్ ప్రెసిడెంట్ శరత్ కుమార్‌రాజు మాట్లాడుతూ విద్యార్థులకు స్కాలర్‌షిప్, మెడికల్ క్యాంపు, వృద్ధులకు పెన్షన్లు తదితర కార్యక్రమాలు చేపడతామన్నారు. అడాప్ట్ ఎ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ రాష్ట్రంలో 44 గ్రామాలను దత్తత తీసుకుని పలు సేవా కార్యక్రమాలను ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో చేజర్ల సుబ్రమణ్యంరాజు, కోనేటి రవిరాజు, సుబ్బరామరాజు, బీజేపీ నాయకురాలు నిశిదా రాజు, అనసూయమ్మ, భరత్ కుమార్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



ధర్నాకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నేతలు

రాయచోటిటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామ కూటమి ప్రభుత్వంకార్మికులకు ఇచ్చిన హామీ అమలు చేయాలని కోరుతూ ఈ నెల 28న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాలి చంద్ర, సలీంబాషా పిలుపునిచ్చారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ధర్నా, కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 28న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, పడాల రమణ పాల్గొంటారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని, సంక్షేమ బోర్డులో ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ సొంత నిధులు కోటి రూపాయలు జమ చేస్తానని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయలేదని ఆరోపించారు. గత ప్రభుత్వం జీవో నెంబర్ 17 ద్వారా దారి మళ్లించిన సంక్షేమ బోర్డు నిధులను తక్షణమే బోర్డులో జమ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 40 వేల పెండింగ్‌లో ఉన్న క్లైములకు నిధులు విడుదల చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల అడ్డాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు హుస్సేన్, నరసింహా, వెంకటేశ్, బాబు గోవిందు, రామదాసు, బాలరాజు పాల్గొన్నారు.

ఉద్యోగులకు దీపావళి కానుక ప్రకటించిన సీఎం

రాజంపేట టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల డిమాండ్లపై సీఎం నారా చంద్రబాబునాయుడు స్పందించడంపై రాజంపేట ఎన్జీవో తాలూకా అడహక్ కమిటీ కన్వీనర్ వరదయ్య, ట్రెజరర్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ దీపావళి పండుగ ముందే తమ డిమాండ్ల సాధనకు కృషి చేసిన జేఏసీ అధ్యక్షులు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డీవీ రమణారెడ్డికి అభినందనలు తెలియజేశారు. పీఆర్సీ ఏర్పాటు విషయంలో 57 మెమో ప్రకారం 11 వేల మంది ఉద్యోగులను ఓపీఎస్ పరిధిలోకి తీసుకురావాలని సీఎం ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు.

మానవత సంస్థకు ప్రజల్లో మంచి గుర్తింపు



నెలవారీ సమావేశానికి హాజరైన అతిథులను సన్మానిస్తున్న మానవతా కమిటీ సభ్యులు

రాయచోటిటౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): లాభాపేక్ష లేకుండా ప్రజలకు సేవలు అందిస్తూ మానవతా సంస్థ మంచిపేరు తెచ్చుకుందని ప్రజా చైతన్య సేవా సంస్థ అధ్యక్షుడు చెన్నారెడ్డి, వైద్యులు నాగహేమంత్‌రెడ్డి, రమ్యశ్రీ తెలిపారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ప్రతిభా జూనియర్ కళాశాలలో మానవత నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆపదలో ఉన్న ప్రజలకు సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ సంస్థను ప్రారంభించారన్నారు. రాయచోటిలో మానవత సంస్థ ప్రారంభం నుండి చేపడుతున్న అన్ని రకాల సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. మానవతా ఆధ్వర్యంలో మృతి చెందిన వారి కోసం బారీ ఫ్రీజర్ బాక్సులు, దహన సంస్కారాల కోసం శాంతి రథాలు, మంచి ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించడం, నైతిక విలువలపై అవగాహన కలిగించడం, మొక్కలు నాటి వాటిని సంరక్షించడం వంటి అనేక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న మానవత కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. సేవా కార్యక్రమాలు చేయాలంటే సభ్యత్వాలు కీలకమని, రాయచోటిశాఖ ఆధ్వర్యంలో 1000 సభ్యత్వాలు నమోదు చేయడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం సమావేశానికి హాజరైన అతిధులకు ఘనంగా సత్కరించి, జ్ఞాపికతో పాటు డైరీని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ చింతంరెడ్డి వెంకట్రామిరెడ్డి, ట్రెజరర్ నాగార్జున, మాజీ అధ్యక్షలు గాండ్లపెంట ఖాదర్‌బాషా, మాజీ సెక్రటరీ వెంకటరామానాయుడు, కోచైర్మన్ షకీల్, డైరెక్టర్ భోజనపు రామకృష్ణ, శివారెడ్డి తదితర మానవత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యుడికి సన్మానం



డాక్టర్ రాజశేఖర్‌ను సన్మానిస్తున్న సమాజ సేవకులు

ఓబులవారిపల్లె, అక్టోబరు 19 (ఆంధ్ర జ్యోతి) : పట్టణాలకు వెళ్లే అవసరం లేకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మూడేళ్ల వ్యవధి లో 200కు పైగా కాన్పు లు చేసిన డాక్టర్ రాజ శేఖర్‌ను సామాజిక కార్యకర్తలు డక్కిలి సుబ్ర మణ్యం, షామీర్‌హుస్సేన్, పులి లవకుమార్, అరవ ఎల్లయ్య ఆదివారం సన్మానించారు. డాక్టర్ రాజశేఖర్ సేవలను అభినందించారు. ఈ సంద ర్భంగా డాక్టర్ మాట్లాడుతూ తన వృత్తి ధర్మాన్ని నిర్వర్తించానని, ఆసుపత్రి సిబ్బంది, కృషి సహాయ సహకారాలతోనే ఇన్ని కాన్పులు చేయగలిగానన్నారు.

దీపావళి ఆనందంగా జరుపుకోవాలి

రాయచోటి-నేతాజీ సర్కిల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినాన్ని మండల పజలు ఆనందంగా జరుపుకోవాలని ఎస్ఐ రవికుమార్ ఆదివారం తెలిపారు. టపాకాయలు కాల్చే సమయంలో పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. మండల వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పండుగ జరుపుకోవాలని తెలియజేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నందలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా ఆదివారం ఉదయం పింఛా ప్రాజెక్టులో నీటిమట్టం పెరగడంతో 10,853 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో బాహుదానది వద్దకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సెక్రటరీ సురేష్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజులు సెలవులు కాబట్టి ప్రజలు నదివద్దకు వెళ్లే అవకాశం ఉందని, అలాంటి వారంతా పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు తొలగించండి



రాయచోటిలో ఫుట్‌పాత్‌పై ఉన్న దుకాణాలు

రాయచోటిటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారి పక్కన ఉన్న కాలిబాటపై ఆక్రమణలను తొలగించాలని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఫుట్‌పాత్ ఆక్రమణలతో ప్రజలు రోడ్డుపై నడుస్తు న్నారని, జరిగే ప్రమాదాలను నివారించాలని కోరారు. మున్సి పల్ అధికారులు, జిల్లా అధికారులు చొరవ తీసుకొని రాయచోటిలోని ప్రజలకు కలుఉతున్న అసౌకర్యాలు తొలగించాలని ఆయన కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా ప్రత్యేక శ్రద్ధతో ప్రమాదాలు జరగకుండా ప్రజల ప్రాణాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

వర్షం కోసం పాతరోళ్లు తరలింపు



గ్రామ సరిహద్దులో ఉన్న రోళ్లను తొలగిస్తున్న గ్రామ పెద్దలు

చిన్నమండెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ సరిహద్దుల్లో రోళ్లు, రుబ్బురాళ్లు ఉంటే వర్షాలు పడవన్న ఉద్దేశంతో మండలంలోని వండాడి గ్రామంలో ఆదివారం వాటికి పూజలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించారు. ఎక్స్‌కవే టర్లు, ట్రాక్టర్లతో గ్రామ పెద్దల సమక్షంలో గ్రామ సరిహద్దు దాటించారు. వర్షాలు పడతాయన్న నమ్మకంతో ఇలా చేస్తున్నామని తెలిపారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి

గాలివీడు, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): క్రాకర్స్ దుకాణాల వద్ద భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ రామకృష్ణ సూచించారు. ఆదివారం పశువుల సంత ప్రాం గణంలో ఏర్పాటు చేసిన టపాకాయల దుకాణాలు, గోదా ముల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టపాకాయల దుకాణాలను తనిఖీ చేసి, ప్రతి షాపులో అగ్నిమాపక పరికరాలు, డ్రమ్ముల్లో నీరు, ఇసుక వంటి అత్యవసర భద్రతా ఏర్పాట్లు ఉండాలని ఆదే శించారు. షాపుల వద్ద పార్కింగ్ సౌకర్యం కల్పించడంతో పాటు, స్టాక్ రిజిస్టర్లను కచ్చితంగా నిర్వహించాలన్నారు. అనుతులు లేకుండా బాణసంచా నిల్వ చేయడం, విక్రయిం చడం నేరమన్నారు. భద్రతా నియమాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

గంజాయి మాఫియా...

- మొక్కుబడి దాడులతో రెచ్చిపోతున్న స్మగ్లర్లు
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన కోడూరు



రైల్వేకోడూరులో పట్టుకున్న గంజాయి, ముగ్గురిని అరెస్టు చేసిన ఎక్సైజ్‌శాఖాధికారులు (ఫైల్)

రైల్వేకోడూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఖద్దరు అండతో రైల్వేకోడూరు నియోజకవర్గంలో గంజాయి స్మగ్లర్లు రెచ్చిపోతున్నారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల్లో విచ్చలవిడిగా గంజాయి లభిస్తుండడంతో యువత పెడదోవపడుతున్నారు. ప్రత్యేక నిఘా లేకపోవడంతో తిరుపతి, రేణిగుంట నుంచి ఆటోల్లో గంజాయిని రైల్వేకోడూరుకు తరలిస్తున్నారని ఎక్సైజ్, సివిల్ పోలీసులు గుర్తించారు. ఇతర ప్రాంతాల నుంచి పెద్దపెద్ద ప్యాకెట్లలో రేణిగుంట, తిరుపతికి చేరుకున్న గంజాయిని చుట్టుపక్కల పట్టణాలకు ఆటోల్లో చేరవేస్తారు. ఆయా పట్టణాల్లో దానిని 50 గ్రాములు నుంచి 100, 200, 500, 700 గ్రాముల పరిమాణంలో ప్యాకెట్లు తయారు చేసి కిలో రూ.12 వేలకు విక్రయిస్తున్నారని అధికారుల విచారణలో తేలింది. రిటైలర్లు దానిని చిన్న, చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి రూ.100 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. ఈ ఏడాది ఓబులవారిపల్లె, చిట్వేలి మండలాల్లో సుమారు 100 కిలోల గంజాయి పట్టుకున్నారు.

భారీగా గంజాయి స్వాధీనం

ఇటీవల ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి సుమారు 1700 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. గంజాయిని ఎక్కడి నుంచి తెస్తారు, ఎవరు ఇస్తారు, ఎంతకు అమ్ముతారు వంటి వివరాలను ఇందులో ప్రధాన నిందితులు గణేష్, శంకర్‌ల నుంచి ఎక్సైజ్ శాఖ అధికారులు కూపీ లాగారు. వారి కాల్‌డేటాను విశ్లేషించారు. వారికి ఎవరెవరితో సంబంధాలున్న అంశంపై ఎక్సైజ్‌శాఖ కూపీ లాగినట్లు తెలిసింది. గడిచిన ఆరేళ్లలో గంజాయి కేసుల్లో పది మందిని అరెస్టు చేశారు.

నేరాలకు కారణమట

విచ్చలవిడిగా గంజాయి లభ్యత నేరాలకు కారణమవుతోంది. శ్రీ కృష్ణా సినిమాహాలు వెనక, రెడ్డివారిపల్లె కొత్త బ్రిడ్జి, చుట్టుపక్కల తోటలతో పాటు రాఘవరాజపురం, సమతానగర్, శెట్టిగుంట, రెడ్డివారిపల్లె రూటు, రైల్వేస్టేషన్ రూటు తదితర ప్రాంతాల్లో గంజాయి మత్తులో యువత తూలుతుంటారని అధికారులు గతంలో గుర్తించారు. ఇటీవల రెడ్డివారిపల్లె బ్రిడ్జి ప్రాంతంలో గంజాయి మత్తులో రెండు వర్గాలు ఘర్షణ పడ్డాయి. రాత్రివేళల్లో పోలీసుల నిఘా లోపించడంతో గంజాయి బ్యాచ్‌లు రెచ్చిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు గట్టి చర్యలు తీసుకోకపోతే అనర్థాలకు దారి తీసే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పటిష్టమైన నిఘా ఉంది



గంజాయి రవాణా, విక్రయాలపై పటిష్టమైన నిఘా ఉంది. ఎప్పటికప్పుడు సమాచారం అందుకుని దాడులు చేస్తున్నాం. గంజాయి ముఠా కోసం గాలిస్తున్నాం. ప్రస్తుతం రైల్వేకోడూరులో గంజాయి విక్రయాలు లేవు. ప్రజలు సహకరించి గంజాయి అమ్మకాలపై సమాచారం అందిస్తే దాడులు నిర్వహిస్తాం.

- తులసి, ఎక్సైజ్ సీఐ

చర్యలు తీసుకుంటున్నాం



గంజాయి విక్రయాలపై చర్యలు తీసుకుంటున్నాం. నిరంతరాయంగా నిఘా ఏర్పాటు చేశాం. సమగ్రమైన సమాచారం అందితే నిందితులు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే ఉండదు.

- వీఎల్ ప్రసాద్‌రెడ్డి, ఎస్ఐ

సురక్ష యాప్‌తో నకిలీ మద్యం నివారణ



షాపు యజమానులకు వినియోగదారులకు యాప్ ఉపయోగాన్ని వివరిస్తున్న సూపరింటెండెంట్ మధుసూదన్

రాజంపేటటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం నివారించడానికి ప్రభుత్వం సురక్ష యాప్ ప్రవేశపెట్టినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.మధుసూదన్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని పలు మద్యం దుకాణాల నిర్వాహకులకు యాప్ పనితీరును వివరించారు. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, మద్యం సీసాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి వివరాలు తెలుసుకోవచ్చు అన్నారు. జిల్లా వ్యాప్తంగా 122 మద్యం దుకాణాలు, 11 బార్లను పరిశీలించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నకిలీ మద్యం ఎక్కడా లేదని వినియోగదారులు గుర్తించాలన్నారు. ఏవైనా అనుమానాలు ఉంటే 7981216391 నంబరుకు సమాచారం అందించాలన్నారు. ఈ తనిఖీలో ఎక్సైజ్ సీఐ మల్లిక, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రైల్వేకోడూరురూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిగుంట పంచాయతీ పరిధిలో ఆదివారం రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రేణిగుంట రైల్వే ఎస్ఐ మధు తెలిపిన వివరాల మేరకు రైలు పట్టాలపై మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించినట్లు తెలిపారు. మృతుడి వయస్సు 38 సంవత్సరాలు ఉంటుందని, అతను గోధుమ రంగు చొక్కా, గళ్ళ లుంగీ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం 9885961430 మరియు 9542166880 నెంబర్లకు సంప్రదించాలని రైల్వే పోలీసులు తెలిపారు.

క్యూలైన్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఎంఓయూ



ఎంఓయూ చేసుకుంటున్న కళాశాల ప్రిన్సిపాల్ రామనాథం, విభాగాధిపతులు పవన్‌కుమార్, అరుల్‌కుమార్

కురబలకోట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు సమీపంలోని డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్సిటీ యాజమాన్యం తమిళనాడు రాష్ట్రం హొసూరుకు చెందిన క్యూలైన్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఎంఓయూ కుదుర్చుకున్నట్లు కళాశాల వీసీ యువరాజ్ పేర్కొన్నారు. ఆదివారం కళాశాలలో ఈసీఈ, ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ రామనాథమ్, విభాగాధిపతులు పవన్‌కుమార్, అరుల్‌కుమార్, ఆ సంస్థ ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో, ఇంటర్న్‌షిప్‌లు, ప్లేస్‌మెంట్, అందించడం, అవగాహన కార్యక్రమాల్లో సహాయ సహకారాలు అందివ్వనున్నట్లు పేర్కొన్నారు. కళాశాల విద్యార్థులు ఉమ్మడి మార్గదర్శకత్వంలో ప్రాజెక్టులు, పరిశోధనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పరిశ్రమ- విద్యా సహకారాన్ని బలోపేతం చేయానికి ఎతగానో దోహదపడుతుందన్నారు. దీని ద్వారా విద్యార్థులకు మరింతగా ఉద్యోగవకాశాలు దక్కనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడిన భానుకుమార్

పీలేరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం బోడుమల్లువారిపల్లె పంచాయతీ మొరవపడ్డిపల్లె వద్ద ఆదివారం ఓ ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు రొంపిచెర్ల మండలం పెద్దమల్లెల పంచాయతీ పెండ్లికనం గూడేనికి చెందిన పి.జ్యోతి భానుకుమార్(23), పి.హరీశ్(21), జ్యోతి కుమార్(19) టపాసులు కొనుగోలు చేయ దానికి ద్విచక్ర వాహనంలో పీలేరుకు బయలు దేరారు. మార్గమధ్యలో మొరవపడ్డిపల్లె వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడగా వారిని చికిత్స కోసం పీలేరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆయుధపూజ

పెద్దతిప్పసముద్రం అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆదివారం లైన్‌మాన్ రమణ తమ సిబ్బందితో కలిసి ఆయుధపూజ నిర్వహించారు. ఉదయం సబ్ స్టేషన్‌లో వేదపండితులచే విద్యుత్ పరిక రాలకు ఆయుధపూజను నిర్వహించారు. సబ్ స్టేషన్ పరిధిలో ఎలాంటి ఆటంకాలు జరగకుండా ఉండాలని కోరుతూ వేదపండితులతో అమ్మవా రికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సిబ్బందితో కలిసి లైన్‌మాన్, విద్యుత్ ఏఈలు సబ్‌స్టేషన్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించి సబ్‌స్టేష న్ ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి ప్రాంగణాన్ని పరిశు భ్రం చేశారు. మండలంలోని వివిధ సబ్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నీటితో కళకళ



సంపతికోట పంచాయతీలో వర్షపునీటితో నిండిన ఫారంపాండ్

- సత్ఫలితాలిస్తున్న వాటర్ షెడ్ పనులు
- నిర్మాణ పనులకు రూ. 7.61 కోట్ల నిధులు
- పనులకు వాటర్ షెడ్ ద్వారా రూ.3.13 కోట్లు ఖర్చు
- నీటి నిల్వలతో కళకళలాడుతున్న చెక్ డ్యాంలు, నీటికుంటలు

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నీటి నిల్వలతో మండలంలోని చెక్ డ్యాంలు, నీటికుంటలు కళకళలాడుతున్నాయి. రూ.7.61 కోట్ల నిధులతో జిల్లా నీటి యాజమాన్య సంస్థ (వాటర్‌షెడ్) ద్వారా సంపతికోట, బూచిపల్లె, రంగసముద్రం, రాపూరివాండ్లపల్లె, మడుమూరు, పులికల్లు గ్రామాల్లో వాటర్‌షెడ్ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ నిధులతో గ్రామాల్లో ఫారం పాండ్‌లు, చిన్న నీటికుంటలు, చెక్‌వాల్స్, అమృత్ సరోవర్, డకౌట్ ఫారంపాండ్‌లు, పర్కులేషన్ ట్యాంక్‌లు(పీటీ), మినీ పర్కులేషన్ ట్యాంక్‌లు (ఎంపీటీ), రాతికట్టడాలు, రైతుల పొలాల్లో ట్రెంచ్‌లు, చెక్‌డ్యాం తదితర పనులు ఆరు గ్రామాల్లో ప్రారంభించింది. అయితే వైసీపీ ప్రభుత్వంలో వాటర్ షెడ్ నిర్మాణ పనులు నత్తనడకన సాగడంతో కేటాయించిన నిధులు అలాగే ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటర్ షెడ్ నిర్మాణ పనులు జోరందుకున్నాయి. ఇటీవల ఫైనాన్స్ సంవత్సరం ముగియడంతో వైసీపీ ప్రభుత్వంలో పూర్తి అయిన పనులకు బిల్లులను ప్రభుత్వం పూర్తి స్థాయిలో చెల్లించింది. కూటమి ప్రభుత్వం వాటర్ షెడ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి పడమటి మండలమైన పెద్దతిప్పసముద్రం మండలంలో ఈ ఆరు గ్రామాల్లో వివిధ రకాల 200 పనులను చేపట్టింది. ఇందులో డకౌట్ ఫారంపాండ్‌లు 77, ఫారంపాండ్‌లు 32, పర్కులేషన్ ట్యాంకులు 10, మినీ పర్కులేషన్ ట్యాంకులు52, రాతి కట్టడాలు 4, ట్రెంచ్‌లు 4, చెక్‌డ్యాంలు 4 పనులకు రూ. 3.13 కోట్లు ఖర్చు చేసింది. ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు ఈ నీటి కుంటలు, ఫారంపాండ్ గుంతలు, చెక్‌డ్యాంలు వర్షపు నీటికి పూర్తిగా నిండిపోవడంతో ఈ ప్రాంతాల్లో భూగర్భ జలాలు పూర్తి స్థాయిలో పెరగడంతో ఈ ప్రాంత రైతుల బోర్లలో నీటి సామర్థ్యం పెరగడంతో రైతులు సంతృప్తి చెందుతున్నారు.

వాటర్ షెడ్ విస్తరిస్తాం

మండలంలోని ఆరు గ్రామాల్లో వాటర్ పనులను చేపట్టడంతో వాటర్ షెడ్ పనులు మంచి ఫలితాలను ఇచ్చాయని, వాటర్ షెడ్ పనులను మిగిలిన గ్రామాల్లో కూడా చేపడితే నీటి నిల్వలు పెరిగి భూగర్భ జలాలు పెరుగుతాయని మండల రైతులు అభిప్రాయ పడుతున్నారు. జిల్లా నీటియాజమాన్య సంస్థ (వాటర్‌షెడ్) ఇప్పటి వరకు ఆరు గ్రామాల్లో కేవలం రూ. 3.13 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఇంకా మిగిలిన రూ. 4.48 కోట్లు నిధులు మిగిలి ఉండడంతో ఇంకా ఉన్న గ్రామాలను ఎంపిక చేసి ప్రభుత్వానికి ప్రాతిపాదనలు పంపి వాటర్ షెడ్ నిర్మాణ పనులు చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

సంపతికోటలో భూగర్భజలాలు పెంపు

సంపతికోట గ్రామంలో చేపట్టిన వాటర్ షెడ్ నిర్మాణ పనుల్లో భాగంగా వివిధ వాటర్ షెడ్ గుంతల్లో నీళ్లు పూర్తి స్థాయిలో చేరి నిండిపోవడంతో అక్కడి రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వాటర్ షెడ్ ద్వారా చేపట్టిన అన్ని ఫారంపాండ్ నీటి గుంతలు ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నీటికుంటల్లో నీరు పుష్కలంగా చేరింది దీంతో నీరు నిల్వ ఉండడంతో ఆ గ్రామానికి చెందిన రైతుల బోర్లల్లో నీరు పుష్కలంగా వస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వాటర్ షెడ్ ద్వారా ఉన్న నిధులను సద్వినియోగం చేసుకుంటామని రైతులు ఆసక్తిగా ఉన్నారు. వాటర్ షెడ్ ద్వారా ప్రభుత్వం మాగ్రామాన్ని ఎంపిక చేయడంతో వాటర్ షెడ్ పనులు మాకు ఎంతో సంతృప్తిని కలిగించాయని సంపతికోట రైతులు జిల్లా నీటి యాజమాన్య సంస్థ (వాటర్‌షెడ్) సిబ్బందికి, కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.





మడుమూరులో పొలాల సమీపంలో నీటితో కళకళలాడుతున్న అమృత్ సరోవర్, రాపూరివాండ్లపల్లెలో వర్షపునీటితో నిండిన డకౌట్ ఫారంపాండ్, రంగసముద్రంలో చెక్‌డ్యాం నిండి మొరవ పోతున్న దృశ్యం

ఉద్యోగుల డిమాండ్లపై సీఎం స్పందన హర్షణీయం

మదనపల్లె అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళి కానుకగా దీపావళి పండుగకు ముందే ఉద్యోగ సంఘాల డిమాండ్లపై సీఎం చంద్రబాబు నాయుడు స్పందించిన తీరు హర్షణీయమని ఏపీ ఎన్జీవోస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డిశేఖర్, శివప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో సభ్యుల సమావేశంలో వారు మాట్లాడుతూ నవంబరు నుంచి ఒక డీఏ విడుదల చేయడం, హెల్త్‌కార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపించడానికి కమిటీ ఏర్పాటు చేసి ఇన్సూరెన్స్ విధానాన్ని పరిశీలించాలని ఆదేశించడం, ఆర్టీసీ ఉద్యోగుల ప్రమోషన్లకు ఉత్తర్వులు జారీ చేయడం, చైల్డ్‌కేర్ లీవులపై ప్రకటన చేయడం, హెల్త్‌కార్డుల విషయంలో ప్యాకేజీల రేట్లు పెంచడం, ఉద్యోగులు ప్రాపర్టీ టాక్స్ నుంచి మినహాయించడం, చెల్లించాల్సిన బకాయలను రద్దు చేయడం హర్షణీయమన్నారు. గురుకుల పాఠశాలల్లో, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచడం, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, ప్రభుత్వ పథకాల్లో భాగస్వామ్యం కల్పించడం, తదితర అంశాల్లో ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరట కలిగించిందన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవోస్, ఏపీ జేఏసీ, మదనపల్లె కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎన్జీవోస్ సంఘం అధ్యక్షుడు రెడ్డిశేఖర్

ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

మదనపల్లె, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం, నియోజకవర్గ ప్రజలకు ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ దీపావళి పర్వదినం వారి కుటుంబాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. కాలుష్యానికి హాని కలిగించే టపాసులు కాకుండా సహజ దీపకాంతులతో పండుగ చేసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఎమ్మెల్యే ఎం.షాజహన్‌బాష, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరాంచినబాబు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ జంగాల శివరాం, టౌన్‌బ్యాంకు ఛైర్మన్ ఎన్.విద్యాసాగర్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఆర్.ఆంజనేయులు, టీడీపీ, జనసేన, మైనార్టీ, బీజేపీ నేతలు కోహూరి మల్లికార్జున నాయుడు, మార్పూరి సుధాకర్ నాయుడు, గంగారపు రామ్‌దాస్ చౌదరి, గంగారపు బాబురెడ్డి, ఎస్.ఎ.మస్తాన్, పఠాన్‌ఖాదర్ ఖాన్, బంగారు రామకృష్ణ, దక్షిణ భారతదేశ ఓబీసీ ఛైర్మన్ జబ్బల శ్రీనివాసులు, టీడీపీ రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి మొటుకు శివ తదితరులు నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

రోలర్ స్కేటింగ్‌లో గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్ సాధించిన వర్షిత

పుల్లంపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని ఎం.వర్షిత రోలర్ స్కేటింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించింది. శనివారం డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడపలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వర్షిత ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించింది. నవంబరులో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని పీడీ నీలకంఠరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని వర్షితను ప్రిన్సిపాల్ లీలాశ్రీహరి, తదితరులు అభినందించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న అయేషా

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ మహిళ విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని పోలీసులు తెలిపారు. రామసముద్రం మండలం చెంబకూరుకు చెందిన చాంద్‌బాషా భార్య అయేషాతో హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో కుటుంబ కలహాల నేపథ్యంలో ఆదివారం విషద్రావణం తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్న అయేషాను భర్త గమనించి వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు జిల్లా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు రామసముద్రం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాముకాటుకు ఆవు మృతి

గాలివీడు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పాముకాటుతో ఆవు మృత్యువాత పడిన ఘటన వెలిగల్లు గ్రామ పంచాయతీలో ఆదివారం చోటు చేసుకుంది. మండలంలోని వెలిగల్లు గ్రామానికి చెందిన మంచూరి వెంకట్రామిరెడ్డికి చెందిన ఆవు ఆదివారం పొలం దగ్గర మేత మేస్తుండగా పాము కాటు వేసింది. దీంతో ఆవు నోటి నుంచి నురగలు కక్కుతూ మృతి చెందింది. మృత్యువాత పడిన ఆవు విలువ దాదాపు రూ.50 వేలు ఉంటుందని, తనకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించాలని బాధిత రైతు కోరాడు.

బీజేపీ నేత రామకృష్ణ మృతి



పెద్దతిప్పసముద్రం అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేత ముద్దసాని రామకృష్ణ (78) ఆదివారం తెల్లవారుఝమున మృతి చెందారు. మధ్యాహ్నం రామకృష్ణ అంత్యక్రియలకు వివిధ పార్టీల నేతలు హజరై శ్రద్ధాంజలి ఘటించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. రామకృష్ణ అంత్యక్రియల్లో పాల్గొన్న వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలో కేష్, బీజేపీ సీనియర్ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లెం శివయ్య, గోరంట్ల రమేష్, ముకుంద, గోల్డెన్ వ్యాలీ రమణారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, ఓబులేసు, జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్, పీటీఎం మండల ఎంపీపీ మహమూద్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శివానంద, వెంకటనారాయణ, రామాంజులు, శ్రద్ధాంజలి ఘటించారు.

ప్రజలు జాగ్రత్తగా దీపావళి చేసుకోవాలి : డీఎస్పీ



వాహనాలకు పూజ చేయిస్తున్న డీఎస్పీ మహేంద్ర సీఐ సత్యనారాయణ తదితరులు

నిమ్మనపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజలు సుఖసంతోషాలతో దీపావళి చేసుకోవాలని మదనపల్లి డీఎస్పీ మహేంద్ర పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో దీపావళి పండుగ సందర్భంగా వాహనాలకు పూజలు నిర్వహించిన డీఎస్పీ మాట్లాడుతూ చిన్న పిల్లలు టపాసులు పేల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. బాణాసంచా దుకాణాల వద్ద ప్రమాదాలు నివారించేందుకు దుకాణాల వద్ద నీరు, ఇసుక, కార్బన్‌డయాక్సైడ్ సిలిండర్స్‌ను సిద్ధంగా వుంచుకోవాలన్నారు. అనంతరం సిబ్బందికి స్వీట్లు, టపాసులు పంచిపెట్టారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ తిప్పేస్వామి, ట్రైనీ ఎస్‌ఐ శ్రీ ప్రియ, హెడ్ కానిస్టేబుల్ రమణ, కానిస్టేబుళ్లు శివ, కేశవ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మద్దిరెడ్డి కొండ్రెడ్డి

తంబళ్లపల్లె, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రతి టీడీపీ కార్యకర్తకు అండగా ఉంటానని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం తంబళ్లపల్లెలో నియోజకవర్గంలోని ఆరు మండలాల టీడీపీ ముఖ్య నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. జరగనున్న స్థానిక సంస్థల్లో టీడీపీ విజయానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు, టీడీపీ నేతలు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. టీడీపీ సీనియర్ నేతల సలహాలు, సూచనలతో రాబోయే స్థానిక సంస్థల్లో తంబళ్లపల్లెలో వంద శాతం విజయం సాధించేందుకు కృషి చేస్తామన్నారు. టీడీపీ ఇన్‌చార్జి ఎంపిక విషయంలో అధిష్టాన నిర్ణయమే శిరోధార్యమన్నారు. ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ సూత్ర, పాత్రధారి వైసీపీయేనని ఆరోపించారు. టీడీపీ నేతలు తాతిరెడ్డి, కశెట్టి వెంకట్రమణ, సిద్దారెడ్డి, బోయపల్లె శివ, రామ్మోహన్‌రెడ్డి, మునాఫ్, మదన, రెడ్డప్పనాయక్, ప్రసాదరెడ్డి, రమణయ్య, నాగార్జున, వెంకటరెడ్డి, కిట్టన్న, నాయుడు, శ్రీరాములు పాల్గొన్నారు.

ఓబీసీల్లో చైతన్యం తీసుకురావాలి

సౌత్ ఇండియా ఓబీసీ అధ్యక్షుడు జబ్బల



సమావేశంలో మాట్లాడుతున్న జబ్బల శ్రీనివాసులు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దేశంలో ఓబీసీలను చైతన్యం పర్చడానికి ప్రత్యేకంగా సమవేశాలు నిర్వహిస్తున్నట్లు సౌత్ ఇండియా ఓబీసీ అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 12న విజయవాడలో ఓబీసీల సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. దేశంలో బీసీ, ఓబీసీ జనగణన శాస్త్రీయంగా నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఓబీసీలు ఉదయం, సాయంత్రం అందుబాటులో ఉంటారని అధికారులు గణాకాలు సేకరించాలన్నారు. ఇప్పటికే తెలంగాణలో కృష్ణయ్య ఆధ్వర్యంలో గణాంకాలు నిగ్గుతేల్చారని, ఆదే రీతిలో కర్ణాటక రాష్ట్రంలో కూడా సిద్దరామయ్య స్ఫూర్తిగా బీసీ, ఓబీసీ నమోదు చేయిస్తున్నట్లు తెలి పారు. స్థానిక ఎన్నికలకు ముందే జనగణన చేయాలని, అందులో బీసీ కులానికి కాలం కేటాయించాలన్నారు. బీసీ, ఓబీసీలకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఇటీవల సౌత్ ఇండియా ఓబీసీల సమావేశం నిర్వహించి కార్యవర్గం, ఇతర కమిటీని ఎంపిక చేశారన్నారు. కార్యక్రమంలో నేతలు గుడే శ్రీనివాసులు, కప్పల రాజన్న, గుడి రామాంజులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎంపీపీ కుసుమకుమారి మృతి



రామసముద్రం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ కుసుమకుమారి(70) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. రెండు రోజుల కిందట ఈమె అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించగా ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈమె మృతి పార్టీకి తీరని లోటని నియోజకవర్గ వైసీపీ కన్వీనర్ నిస్సార్‌అహ్మద్, మండల వైసీపీ నేతలు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వర్షం కోసం పాడుపడ్డ రోళ్లు తరలింపు



రోళ్లను తొలగిస్తున్న గ్రామ పెద్దలు

చిన్నమండెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వండాడి గ్రామంలో పాడుబడిన రోళ్లు, రుబ్బురాళ్లను గ్రామ సరిహద్దు దాటించారు. సరిహద్దులో పాడుబడిన రోళ్లు, రుబ్బురాళ్లు ఉండడంతో వర్షాలు పడవన్న పెద్దలు సూచన మేరకు తరతరాలుగా వస్తున్న సంప్రదాయాన్ని మంగళ వాయి ద్యాలు నడుమ సంప్రదాయ పూజలతో ఎక్స్‌కవేటర్లతో ట్రాక్టర్లు పెట్టి గ్రా మ పెద్దల సమక్షంలో వాటిని సరిహద్దు దాటించారు. ఇలా చేస్తే వర్షాలు పడతాయన్న నమ్మకంతో ఇలా చేస్తున్నామని తెలిపారు.

గల్లంతైన యువకుడి శవం లభ్యం

సిద్దవటం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సిద్దవటం పెన్నానదిలో శనివారం మధ్యాహ్నం వంతాటిపల్లె వాసి పొట్టిగాండ్ల నందా(35) చేపల వేటకు వెళ్లి నీటిలో మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న నందా భార్య పులి సుజాత హుటాహుటిన బంధువులకు సమాచారం ఇవ్వడంతో సిద్దవటం పోలీసులు రంగంలోకి దిగి అగ్నిమాపక రిస్కు టీమ్‌ను పిలిపించి గజ ఈతగాళ్లతో పెన్నానదిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం మూలపల్లె సమీపంలో శవం లభ్యమైనట్లు ఏఎస్‌ఐ బాలయ్య తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

డీఏ ప్రకటనపై ఉద్యోగ సంఘం నేతల హర్షం




తాటిపర్తి గంగాధరం - పచ్చార్ల సుధాకర్

పీలేరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఏపీ ఉద్యోగులకు ఒక డీఏ ఇవ్వాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటనపై నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు రెడ్డి రమేశ్, రాష్ట్ర కౌన్సిలర్ తాటిపర్తి గంగాధరం, ఏపీసీపీఎస్ఈఏ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్యోగుల పక్షపాతి కాబట్టి డీఏ ప్రకటించారన్నారు. అదే విధంగా డీఏ బకాయిలు, సరెండర్ లీవులు, 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని చెప్పడం, యాప్‌ల భారం తగ్గిస్తామని చెప్పడం సంతోషకరమన్నారు. వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులను, ఉద్యోగ సంఘాల నేతలను దగ్గరకు కూడా రానీయలేదని, కూటమి ప్రభుత్వంలో సాక్షాత్తు ముఖ్యమంత్రి చర్చల్లో పాల్గొనడం శుభపరిణామమన్నారు. ఉద్యోగులకు రావాల్సిన మూడు డీఏలు, పీఆర్సీ కమిటీ నియామకం, కమిటీ నివేదిక వచ్చేలోపు మధ్యంతర భృతి ప్రకటించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని వారు కోరారు.

పీలేరులో సందడే...సందడి...

- కొనుగోలుదారులతో కిటకిటలాడిన టపాకాయల దుకాణాలు
- పండుగ శోభ సంతరించుకున్న గ్రామాలు

పీలేరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ నేపథ్యంలో ఆదివారం పీలేరులో సందడి నెలకొంది. టపాకాయలు, కొత్త బట్టలు, పూజాసామగ్రి, ఇతర నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు జనం పెద్దఎత్తున తరలిరావడంతో అన్ని దుకాణాల్లోనూ రద్దీ నెలకొంది. సాధారణంగా ఆదివారం నిర్మానుష్యంగా కనిపించే పీలేరు రోడ్లు దీపావళి కోసం స్వగ్రామాలకు తరలివచ్చిన వారు, పీలేరు నుంచి ఇతర ప్రాంతాలకు వెళుతున్న వారు, కొనుగోళ్ల కోసం వచ్చిన వారితో రోడ్లన్నీ కిటకిటలాడాయి. దీంతో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం నాలుగు రోడ్ల కూడలి, ఆర్టీసీ బస్టాండు, పంచాయతీ ఆఫీసు మిట్ట ప్రాంతాల్లో పలుమార్లు ట్రాఫిక్ జామ్ అయింది. విజయదశమి రోజుల్లో దుకాణాలు, వాహనాలకు ఆయుధపూజ చేసుకోలేకపోయినా చాలా మంది ఆదివారం పూజలు నిర్వహించారు. ఏఎంసీ ప్రాంగణంలోకి టపాకాయల దుకాణాలు కొనుగోలుదార్లతో కిటకిటలాడాయి.


ఏఎంసీ ప్రాంగణంలోని టపాకాయల దుకాణాల వద్ద సందడి




పీలేరు ఏఎంసీ వద్ద ట్రాఫిక్ జామ్









భద్రతా ప్రమాణాలు పాటించాలి

గాలివీడు, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): క్రాకర్స్ దుకాణాల వద్ద భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ రామకృష్ణ సూచించారు. ఆదివారం పశువుల సంత ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టపాకాయల దుకాణాలు, గోదాముల్లో తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టపాకాయల దుకాణాలను తనిఖీ చేసి, ప్రతి షాపులో అగ్నిమాపక పరికరాలు, డ్రమ్ముల్లో నీరు, ఇసుక వంటి అత్యవసర భద్రతా ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. షాపుల వద్ద పార్కింగ్ సౌకర్యం కల్పించడంతో పాటు, స్టాక్ రిజిస్టర్లను కచ్చితంగా నిర్వహించాలన్నారు. అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ చేయడం, విక్రయించడం నేరమన్నారు. భద్రతా నియమాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నందలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా ఆదివారం ఉదయం పించా ప్రాజెక్టులో నీటిమట్టం పెరగడంతో 10,853 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో బాహుదానది వద్దకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సెక్రటరీ సురేష్ హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ రెండు రోజులు సెలవులు కాబట్టి ప్రజలు నదివద్దకు వెళ్లే అవకాశం ఉందని, అలాంటి వారంతా పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

దీపావళిని ఆనందంగా చేసుకోవాలి

రాయచోటి-నేతాజీ సర్కిల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినాన్ని మండ ల పజలు ఆనందంగా చేసు కోవాలని ఎస్ఐ రవికుమార్ ఆదివారం తెలిపారు. టపాకా యలు కాల్చే సమయంలో పిల్లలు జాగ్రత్తలు తీసుకోవా లని తెలియజేశారు.





వైద్యుడికి సన్మానం

ఓబులవారిపల్లె, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణాలకు వెళ్లే అవసరం లేకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మూడేళ్ల వ్యవధిలో 200కు పైగా కాన్పులు చేసిన డాక్టర్ రాజశేఖర్‌ను సామాజిక కార్యకర్తలు డక్కిలి సుబ్ర మణ్యం, షామీర్‌హుస్సేన్, పులి లవకుమార్, అరవ ఎల్లయ్య సన్మానించారు. డాక్టర్ రాజశేఖర్ సేవలను అభినందించారు. డాక్టర్ మాట్లాడుతూ వృత్తి ధర్మాన్ని నిర్వర్తించానని, ఆస్పత్రి సిబ్బంది, కృషి సహాయ సహ కారాలతోనే ఇన్ని కాన్పులు చేయగలిగానన్నారు.



